క్లుప్తంగా

వరసిద్ధుని సేవలో తంబళ్లపల్లె ఎమ్మెల్యే

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి గురువారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందించారు.

పేదలకు మెరుగైన వైద్యం



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్‌తో పేదలకు ప్రభుత్వం మెరుగైన వైద్యసేవలు అందిస్తోందని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. నెల్లిమంద పల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 80 మందికి వైద్యులు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. పీహెచ్‌ఎన్ జీవకళ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఎ.గొల్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్



ఎ.గొల్లపల్లెలో రోగులకు వైద్యం చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె: మండలంలోని ఎ.గొల్లపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ వినయ్ కుమార్ 47 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అదే విధంగా గర్భవతులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్యపరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. హెల్త్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సస్య రక్షణ పద్ధతులు పాటించాలి

ఐరాల: మామిడి తోటల్లో సస్య రక్షణ పద్ధతులు పాటించాలని మండల ఉద్యానశాఖ అధికారి సాగరిక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో పూత రాని మామిడి తోటల్లో తేలికపాటి నీటి తడులు ఇస్తే పూత వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. పూత వచ్చిన తోటల్లో నీరు పెట్టవలసిన అవసరం లేదన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి

పూతలపట్టు: ప్రభుత్వ వసతి గృహంలోని విద్యార్థులకు సిబ్బంది ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం పెట్టాలని జిల్లా సాంఘిక సంక్షేమాధికారి రాజ్యలక్ష్మి ఆదేశించారు. పి.కొత్తకోట ప్రభుత్వ వసతి గృహాన్ని ఆమె గురువారం తనిఖీ చేశారు. ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలలో లోపాలు గమనిస్తే వెంటనే తెలియజేయాలని కోరారు. విద్యార్థుల ఆహార విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట సహాయ సాంఘిక సంక్షేమాధికారి షకీలా, ఇన్‌చార్జ్ వార్డెన్ శ్రీకాంత్ ఉన్నారు.

నేడు వ్యవసాయ సలహామండలి సమావేశం

బంగారుపాళెం: మండలంలోని దండువారిపల్లెలో శుక్రవారం జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఏఓ చిట్టిబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని, జేసీ శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయశాఖ అధికారులు హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశానికి రైతులు హాజరు కావాలని ఆయన ప్రకటనలో కోరారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం

తవణంపల్లె: మండలంలోని అరగొండలోని టోటల్ హెల్త్ కమ్యూనిటీ భవనంలో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు వైఎస్సార్‌సీపీ నేతల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సీపీ హరిరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ పాల్గొంటారని, పార్టీ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి, హాజరైన ముస్లింలు





చంద్రబాబుది మొసలి కన్నీరు

- ఎన్నికలొస్తే తప్పుడు హామీలు
- బాబును నమ్మితే పుట్టగతులుండవ్
- జగనన్న చేసే మేలును మరవద్దు
- సమావేశంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్: చంద్రబాబు మొసలి కన్నీరు కారుస్తూ ప్రజలను మరోసారి దగా చేసేందుకు యత్నిస్తున్నారని, ఆ కన్నీటికి కరిగితే మళ్లీ మోసపోక తప్పదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి స్పష్టం చేశారు. చిత్తూరు పాతబస్తాండులో గురువారం ముస్లిం మైనారిటీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విజయానందరెడ్డి మాట్లాడారు. ఎన్నికలు వస్తే తప్పుడు హామీలతో గద్దెనెక్కాలని చంద్రబాబు శతధా యత్నిస్తున్నారని విమర్శించారు. బాబును నమ్మితే పుట్టగతులుండవని..ఇందుకు నిదర్శనం ఆయన పాలనలో ఎంత దగా చేశారో ప్రజలకు అనుభవమేనన్నారు. బాబొస్తే జాబ్, పసుపు కుంకుమ, రైతు రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం.. ఇలా పలు హామీలతో అన్ని వర్గాల వారిని నట్టేట ముంచారని దుయ్యబట్టారు. బాబు హయంలో పచ్చనేతలు మాత్రమే బాగుపడ్డారని, పేద ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలిశారన్నారు. ఎన్నికల దృష్ట్యా మళ్లీ పచ్చి అబద్ధాలు ఆడుతున్నారని, ప్రజలు మరోసారి టీడీపీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీని ఢీకొనేందుకు తోడేళ్లంతా కలిసి గుంపుగా వస్తోందని..జగనన్న మాత్రం సింగిల్‌గా బరిలోకి దిగుతున్నారని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పేదలకు మేలు జరిగిందన్నారు. జగనన్న ముస్లిం మైనారిటీల సంక్షేమానికి కృషి చేశారన్నారు. కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందజేశారన్నారు. కరోనా విపత్తు యావత్తు దేశాన్ని అతలాకుతలం చేసినా, రాష్ట్రం అప్పుడు తీవ్ర ఇబ్బందుల్లో ప్రజల వైద్యానికి పెద్దపీట వేసి, అన్ని కష్టాలను అధిగమించారన్నారు. పథకాలను సైతం సకాలంలో అందజేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పేదల బాగోగుల కోసమే తపించే వైఎస్సార్ సీపీని ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ గెలిపించుకుందామన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే...చిత్తూరు అభివృద్ధిని చూడొచ్చానన్నారు. కొత్తగా యూనివర్సిటీ, ఆస్పత్రి బాగోగులను చూస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరి పంటను ఆశిస్తున్న తెగుళ్లు



కంపలపల్లెలో వరి పంటకు మందులు స్ప్రే చేస్తున్న రైతు

- సస్యరక్షణతోనే నివారణ సాధ్యం
- రబీలో 320 ఎకరాల్లో వరి సాగు చేస్తున్న రైతాంగం

తవణంపల్లె: రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన వరి పంటకు అగ్గి తెగుళ్లు, తెల్లచీడలు వ్యాపించి పంటను నాశనం చేస్తున్నాయి. రైతులు గుర్తించి సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటను కాపాడుకోవాల్సి ఉంది. వ్యవసాయాధికారులు సైతం క్షేత్రస్థాయిలో వరి పంటను పరిశీలించి పలుచోట్ల అగ్గితెగుళ్లు, చీడ సోకినట్లు గుర్తించి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రబీ సీజన్‌లో మండలంలో 320 ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేశారు. ప్రస్తుతం వరి పంట వివిధ దశల్లో సాగులో ఉంది. రైతులు అధికంగా తెగుళ్లు, చీడలు తట్టుకొనే సామర్థ్యం కలిగిన నర్మద రకం వరి నారు నాటి సాగు చేస్తున్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా మంచు అధికంగా కురుస్తుండడంతో వరి పంటను తెగుళ్లు, చీడలు ఆశించే అవకాశం ఉంది. రైతులు ముందుగా గుర్తించి నివారణ కోసం సస్యరక్షణ చర్యలు చేపడితే ఆశించిన దిగుబడి సాధించవచ్చు. మచ్చ తెగుళ్లు ఆశించే అవకాశం ఉంది. దీని వలన దిగుబడి తగ్గే అవకాశం ఉంది.

సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మండలంలో రబీ సీజన్‌లో రైతులు వరి పంట సాగు చేశారు. కానీ పంటకు వాతావరణంలోని మార్పులతో తెగుళ్లు, చీడలు, పురుగులు ఆశించే అవకాశం ఉంది. రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టి నివారించవచ్చు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించి మంచి దిగబడి సాధించాలి. – జి. ప్రవీణ్, వ్యవసాయాధికారి, తవణంపల్లె

ముగిసిన కుంభాభిషేక వేడుకలు



సీతారామ కల్యాణం



పూజలో రామచంద్రనాయుడు దంపతులు

పూతలపట్టు: మండలంలోని పేటమిట్ట గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండరామస్వామి ఆలయ ప్రతిష్ఠ, కుంభాభిషేకం అంగరంగ వైభవంగా జరిగింది. గురువారం ఉదయం ఆలయ చైర్మన్ గల్లా రామచంద్రానాయుడు చేతులమీదుగా సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. గల్లా జయదేవ్, అరుణకుమారి, గౌరినేని రమాదేవి చేతులమీదుగా సీతారామ కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. భక్తుల శ్రీరామ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. వేడుకలను ఘన విజయం చేసినందుకు ప్రజలకు రామచంద్రనాయుడు ధన్యవాదాలు తెలిపారు.

రేపు జాబ్‌మేళా

చిత్తూరు కలెక్టరేట్ : ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాల భర్తీకి ఈ నెల 17న పుత్తూరు రోడ్డులో ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధికల్పనా అధికారిణి పద్మజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులను 8 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూ చేస్తారని, పదోతరగతి నుంచి డిగ్రీ వరకు చదివిన 18 నుంచి 35 ఏళ్ల లోపు అభ్యర్థులు పాల్గొనవచ్చన్నారు. జిల్లాలోని నిరుద్యోగులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జూదరుల అరెస్ట్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని సంతపేటలో గురువారం పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో ఐదుగురు జూదరులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.4750 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ ఉలసయ్య తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి

గంగవరం: రూ.40వేల విలువ చేసే కర్ణాటక మద్యం అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిని గంగవరం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి కథనం.. మండలంలోని కుక్కలదొడ్డి క్రాస్ వద్ద గురువారం ఎస్ఐ తన సిబ్బందితో వాహనాలను తనిఖీ చేశారు. కర్ణాటక వైపు నుంచి బైక్‌లో వస్తున్న వ్యక్తిని ఆపి తనిఖీ చేశారు. బైక్ వెనుక రెండు సంచుల్లో 10 కేసులు కర్ణాటక మద్యం తెస్తున్నట్టు గుర్తించి అతడిని అరెస్ట్ చేశారు. పోలీసుల ప్రాథమిక విచారణలో నిందితుడు బైరెడ్డిపల్లె చప్పిడిపల్లెకు చెందిన శరవణకుమార్ అని, కర్ణాటక రాష్ట్రం తిప్పిదొడ్డిలోని ఎస్ఎల్‌వీ వైన్‌షాప్ నుంచి ఈ మద్యం తెస్తున్నట్టు తేలింది. నిందితుడితో పాటు మద్యం షాపు ఓనర్ శివపై కేసు నమోదు చేశారు.

రథసప్తమి వేడుకల్లో ఎంపీ, ఎమ్మెల్యే



గంగవరం: మండలంలోని షిరిడీ సాయిబాబా ఆలయం 25వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో సాయినాథునికి ఉదయం నుంచి అర్చకులు విశేష పూజలు చేశారు. నియోజకవర్గం నలుమూలల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి దర్శించుకున్నారు. రాత్రి సాయినాథుని పల్లకీ సేవ, రథసప్తమి వేడుకలకు చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ హాజరయ్యారు. ఆలయ ప్రతినిధులు వారిని శాలువాలతో సత్కరించారు. బాబా ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. పల్లకీసేవ ఎదుట కోలాటాలు, భజనబృందాలు అలరించాయి. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, వాణి విద్యాసంస్థల అధినేత క్రిష్ణమూర్తిరెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు గిరిరాజారెడ్డి, మామడుగు సర్పంచ్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు



సదస్సుకు హాజరైన రైతులు



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదనరెడ్డి

చౌడేపల్లె: టమాట సాగులో రైతులు ఆధునిక పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా ఉద్యానవన శాఖాధికారి మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం పాదలపల్లె సమీపంలోని మోహన్‌రెడ్డి నర్సరీ వద్ద ఉద్యానశాఖ నియోజకవర్గంలో ఆరు మండలాల టమాట రైతులకు అవగాహన సదస్సు నిర్వహించింది. ఈ సదస్సుకు శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకట రమణప్ప, డాక్టర్ శ్రీధర్ (బెంగళూరు) హాజరై, టమాట పంట సాగుచేసే విధానం, దుక్కి దున్నకం, ఎరువులు, సస్యరక్షణ, మందుల పిచికారీ, పంట దిగుబడి , గ్రేడింగ్ విధానంపై అవగాహన కల్పించారు. ప్రధానంగా ఈ ప్రాంతాల్లో ఉర్లగట్ట రోగం, బాక్టీరియా విల్ట్, కాయ కుళ్లు తెగులు, సూదిపురుగు బెడద తీవ్రంగా ఉందని రైతులు అధికారుల దృష్టికి తెచ్చారు. ఉర్ల గట్ట రోగం నివారణకు టైమిథోమార్ప్ 1గ్రాము మాంకోజిట్ 2గ్రాములు, లేదా అజాక్సిస్ట్రోబిన్ 1గ్రాము, క్లోరోథాలోనిల్ 2గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.బ్యాక్టీరియా విల్ట్ నివారణకు స్ట్రెప్టోమైసిన్ 2గ్రాములు, కాపర్ ఆక్సిక్లోరైట్ 3గ్రాములు, లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని, అలాగే కాయ కుళ్లు తెగులు నివారణకు బావిస్టిన్ 1గ్రాము, టాప్సిన్ 2గ్రాములు, పోలియో గోల్డ్ 2గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. సూది పురుగు నివారణకు ఫెరమాన్ ఎరలను పొలంలో అమర్చాలన్నారు. సమావేశంలో హెచ్‌ఓలు సంతోషికుమారి, లక్ష్మీ ప్రసన్న, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల పట్టివేత



రంగాపురంలో కుక్కలను పడుతున్న ప్రత్యేక సిబ్బంది

పలమనేరు: పట్టణంలో వీధి కుక్కల పట్టివేతకు గురువారం పూనుకున్నారు. గత మున్సిపల్ సమావేశాల్లో వీధికుక్కల బెడదను సభ్యులు ప్రస్తావించడం విదితమే. ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి..వీధికుక్కలను పట్టివేతను అత్యవసరంగా చేయాలని ఆదేశించడంతో అధికారులు రంగంలోకి దిగారు. పట్టుకున్న వీధికుక్కలకు తిరుపతిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను చేసి ఆ తర్వాత వాటి ఆవాస ప్రాంతాల్లో వదిలేయనున్నట్టు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. రోజుకు 30 కుక్కలను పట్టి ప్రత్యేక వాహనంతో తిరుపతిలోని అనిమల్ కేర్ కేంద్రానికి తరలించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గుల్జార్, రవి, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనాథ్

రామకుప్పం: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను గురువారం కుప్పం డీఎస్పీ శ్రీనాథ్ తనిఖీ చేశారు. స్టేషనులో రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల్లో అరెస్టులపై ఆరా తీశారు. శాంతిభద్రతల విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించాలన్నారు. రాబోవు ఎన్నికల్లో పోలీసులు అనుసరించాల్సిన విధి విధానాలను మాట్లాడారు. కార్యక్రమంలో కుప్పం రూరల్ సీఐ ఈశ్వర్‌రెడ్డి, ఎస్ఐ శివకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి



సంత్ సేవాలాల్ మహరాజ్ చిత్రపటాన్ని ఊరేగిస్తున్న సుగాలీ నాయకులు

పుంగనూరు: బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ 285 జయంతి వేడుకలను గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. అడహక్ కమిటీ సభ్యులు బాణావత్ మునీంద్రనాయక్, నాగేనాయక్ , ఈశ్వర్‌నాయక్ ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి పాలాభిషేకం చేశారు. అనంతరం చిత్రపటాన్ని ట్రాక్టర్‌లో ఉంచి ఊరేగించారు. సుగాలి మిట్ట పరిధిలోని 7 తాండాల ఆధ్వర్యంలో సేవాగడ్ వద్ద భోగ్‌బండార్‌తో పాటు అన్నదానం చేశారు.

పంటలపై ఏనుగుల దాడి

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని కావేటిగారిపల్లె పంచాయతీ కమలాపురం సమీపం ఆచారి ఇళ్ల వద్ద గురువారం తెల్లవారుజామున ఏనుగుల గుంపు పంటలపై దాడి చేసి నష్టం కలిగించాయి. అరటి తోటలు, వరిపంటకు ఎక్కువ నష్టం కలిగించాయి. ఏడు ఏనుగుల గుంపు వచ్చిన నట్లు రైతులు తెలిపారు. అటవీ అధికారులు స్పందించి ఏనుగుల బారి నుంచి పంటలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

ఏనుగుల దాడిలో దెబ్బతిన్న అరటి పంట



అన్ని మున్సిపాలిటీల్లో సోలార్ పవర్ ప్లాంట్లు

- పుంగనూరు మున్సిపాలిటీకి ఏటా రూ.1.20 కోట్లు ఆదా
- మరో 30 ఏళ్లు సౌర విద్యుత్ ఇస్తాం
- సోలార్ పవర్ ప్లాంట్ ప్రారంభంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెల్లడి
- రూ.14.50 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం



సోలార్ ప్లాంట్‌ను ప్రారంభించి పరిశీలిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పక్కన ఎంపీ రెడ్డెప్ప

పుంగనూరు: పట్టణం, మండలంలోని వివిధ ప్రాంతాలలో రూ.14.50 కోట్లతో పూర్తి చేసిన పలు అభివృద్ధి పనులను మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డితో కలసి ప్రారంభోత్సవాలు చేశారు. నియోజకవర్గంలో కపాడంమిట్టపల్లెలో టీఅండ్‌డీ నిధులు రూ.1.47 కోట్లతో నిర్మించిన ట్రాన్స్‌ఫార్మర్ రిపేరు సెంటర్(విద్యుత్ నియంత్రికల మరమ్మతుల) కేంద్రం, ఆరడిగుంట,గోపిశెట్టిపల్లెలో పీఎఫ్‌సీ నిధులు రూ.6.44 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్లు, పట్టణంలోని సమ్మర్‌స్టోరేజ్ వద్ద రూ.5.90 కోట్లతో ఒక మెగావాట్ సామర్థ్యం గల సోలార్ పవర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అలాగే స్థానిక 3వ వార్డు శాంతినగర్‌లో గృహాల మీదుగా వెళ్తున్న 33కేవీ విద్యుత్ లైను మార్పు చేసేందుకు మంత్రి పెద్దిరెడ్డి భూమి పూజ చేశారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ, సోలార్ పవర్ ప్లాంట్ మూలాన మున్సిపాలిటీకి ఏటా రూ.1.20 కోట్లు కరెంటు బిల్లు ఆదా అవుతుందన్నారు. ఈ ప్రాజెక్టులతో మరో 30ఏళ్ల పాటు పట్టణానికి నాణ్యమైన విద్యుత్ ఇస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపాలిటీలలో సోలార్‌ప్లాంట్ల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. గతంలో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కోసం మరమ్మతుల కోసం ఇబ్బందుల నడుమ దూరప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, పుంగనూరులో మరమ్మతుల కేంద్రం ఏర్పాటు చేయడంతో ఇక ఇక్కట్లేవీ ఉండవని రైతులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సమ్మర్‌స్టోరేజ్‌ను మంత్రి పరిశీలించి నీటి మట్టంపై ఆరాతీశారు.

పచ్చదనంతో పర్యావరణాన్ని రక్షిద్దాం



మొక్కలు నాటి నీరుపోస్తున్న మంత్రి

ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు వద్ద సోలార్ పవర్ ప్లాంట్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మొక్కలు నాటి నీరు పోశారు. ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణతో పాటు పొలాల వద్ద మొక్కలను పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, కమిషనర్ నరసింహప్రసాద్, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, రాష్ట్ర జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, మండల సచివాలయాల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ చెంగారెడ్డి, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు జింకా వెంకటాచలపతి, బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి, డైరెక్టర్ శివప్రసాద్, సీజీఎం చలపతి, ట్రాన్స్‌కో ఈఈ శ్రీనివాసమూర్తి, మహేష్‌రెడ్డి, తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, ఎంపీడీఓ మునిరెడ్డి, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఐదుగురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

మండలంలోని గూడూరుపల్లెకు చెందిన ఆర్.మునిలక్ష్మికి రూ.1.20 లక్షలు, అగ్రహారానికి చెందిన జయమ్మకు రూ.లక్ష, ఆరడిగుంటకు చెందిన జి.రెడ్డెప్పకు రూ.లక్ష, చంద్రమాకులపల్లెకు చెందిన నారాయణకు రూ.55 వేలు, వై.సునీలకు రూ.23 వేల చొప్పున ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కులను మంత్రి పంపిణీ చేశారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి